సాక్షి
సంగారెడ్డి
బుధవారం ౹ 14 ౹ జూన్ ౹ 2023



మైనర్ తప్పు.. మేజర్ ముప్పు
తల్లిదండ్రులకు పిల్లలే సర్వస్వం. వారిపై అతి ప్రేమతో బైక్‌లు, కార్లు ఇస్తున్నారు. తల్లిదండ్రులే వాహనాలు ఇచ్చి, వారిని ప్రమాదాల్లోకి నెడుతున్నారు. 8లో



మహిళా సాధికారతకు పెద్దపీట
మహిళా సాధికారికతకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. 9లో

అందరికీ నెగెటివ్
పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొన సాగుతున్నాయి. మంగళవారం 15 మందికి కోవిడ్ ర్యాపిడ్ టెస్టులు చేశారు. అందులో అంద రికీ నెగెటివ్ వచ్చిందని నిర్వాహకుడు మనోహర్ తెలిపారు. అదేవిధంగా ఆర్టీపీసీఆర్ టెస్టులు 12 మందికి చేసినట్లు చెప్పారు.

న్యూస్‌రీల్

ప్రభుత్వం భట్రాజులను గుర్తించాలి

సంగారెడ్డి టౌన్: భట్రాజు కులస్తులకు, అన్ని కుల వృత్తులకు అందించే రూ.లక్ష ఆర్థిక సాయం అందించాలని సంగారెడ్డి జిల్లా భట్రాజు సంఘం అధ్యక్షుడు నంది భట్టు నర్సింహరాజు మంగళవారం కోరారు. తెలంగాణ రాష్ట్రంలో భట్రాజులు సుమారు 10 లక్షల మంది ఉన్నారని, వారు సామాజికంగా ఆర్థికంగా, రాజకీయంగా చాలా వెనుకబడి ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సంక్షేమ పథకాలలో వారికి అవకాశం కల్పించడం లేదని, అన్ని కులాలకు ప్రాధాన్య ఇస్తున్న ప్రభుత్వం తమను కూడా గుర్తించాలని విజ్ఞప్తి చేశారు.

పోరాట ఫలితమే పెన్షన్ పెంపు



మాట్లాడుతున్న ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర కార్యదర్శి అడివయ్య

కొండాపూర్(సంగారెడ్డి): ఎన్‌పీఆర్‌డీ పోరాట ఫలితంగానే రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులకు పెన్షన్ రూ.వెయ్యి పెంచిందని, దివ్యాంగుల రోస్టర్ పది లోపు తగ్గించే వరకు ఉద్యమ చేస్తామని ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర కార్యదర్శి అడివయ్య ప్రభుత్వాన్ని హెచ్చరించారు. మంగళవారం సంగారెడ్డిలోని కేవల్ కిషన్ భవన్‌లో ఎన్‌పీఆర్‌డీ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వికలాంగుల హక్కుల జాతీయ వేదిక ఆధ్వర్యంలో గత ఏడాది నుంచి ధరల పెరుగుదలకు అనుగుణంగా వికలాంగుల పెన్షన్ రూ. 10 వేలకు పెంచాలని దశల వారీగా రాష్ట్ర వ్యాప్తంగా అనేక రూపాల్లో ఉద్యమాలు చేశామన్నారు. ఉద్యమాల ఫలితంగానే మంచిర్యాల జిల్లాలో జరిగిన బహిరంగ సభలో రూ. వెయ్యి పెంచుతున్నామని సీఎం ప్రకటించి జూలై నుంచి అమలు చేస్తామని చెప్పడం జరిగిందన్నారు. దివ్యాంగుల ఉద్యోగ రోస్టర్ 10 లోపు తగ్గించకపోవడం ద్వారా నిరుద్యోగ దివ్యాంగులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే రోస్టర్ పాయింట్లు 10 లోపు తగ్గించాలని డిమాండ్ చేశారు. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వేలో వికలాంగులను మినహాయించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ర్యాంపులు నిర్మించాలన్నారు. సమావేశంలో జిల్లా సహాయ కార్యదర్శి సుగ్గిరి వెంకటేష్, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

నేడు తెలంగాణ వైద్య ఆరోగ్య దినోత్సవం

సంగారెడ్డి టౌన్: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా బుధవారం తెలంగాణ వైద్యారోగ్య దినోత్సవం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ డాక్టర్ శరత్ మంగళవారం తెలిపారు. బుధవారం సంగారెడ్డి పట్టణంలో పీఎస్‌ఆర్ గార్డెన్స్‌లో వైద్య ఆరోగ్య దినోత్సవం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని నియోజక వర్గాలలో కేసీఆర్ కిట్, న్యూట్రిషన్ కిట్, సీఎంఆర్‌ఎఫ్ లబ్ధిదారులు, వైద్య ఆరోగ్య సిబ్బంది, మెడికల్, నర్సింగ్, పారామెడికల్ కాలేజీల విద్యార్థులు, ప్రజా ప్రతినిధులు, ప్రజలతో సభలు నిర్వహిస్తారని తెలిపారు. అన్ని ప్రభుత్వ ఆస్పత్రులలో పేషెంట్లకు పండ్లు పంపిణీ చేస్తారని, ఉత్తమ ఆశా వర్కర్, ఏఎన్‌ఎం, స్టాఫ్ నర్స్, ల్యాబ్ టెక్నీషియన్, ఉత్తమ డాక్టర్లకు జ్ఞాపిక, ప్రశంసా పత్రాన్ని అందజేస్తారన్నారు.

అఖిలపక్ష సమావేశం



మాట్లాడుతున్న కౌన్సిలర్‌లు, నాయకులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని సమస్యలపై మంగళవారం తెల్లాపూర్ మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రవీందర్ ఆధ్వర్యంలో అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కౌన్సిలర్‌లు కొల్లూరి భరత్, భానూరి మంజుల రెడ్డి, పావని రవీందర్, సరితారెడ్డి, తెల్లాపూర్ మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రవీందర్, తెల్లాపూర్ బీఎస్పీ అధ్యక్షుడు సుదర్శన్ మాట్లాడారు. ప్రజా సమస్యలను పరిష్కారించడంలో పాలకులు పూర్తిగా విఫలమయ్యారన్నారు. గతంలో తెల్లాపూర్ గ్రామానికి చెందిన 400 ఏకరాల భూమిని ప్రభుత్వానికి ఇవ్వడం జరిగిందన్నారు. ప్రజల అవసరాల కోసం ప్రతీ గ్రామానికి పదెకరాల భూమిని ప్రభుత్వం వెంటనే కేటాయించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం కొల్లూర్‌లో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లలను స్థానిక కోటా కింద మున్సిపాలిటీ పరిధిలోని నిరూపేదలకు 25 శాతం కేటాయించాలన్నారు. మౌలిక వసతుల నిర్వహణపై చర్చించారు. సమావేశంలో కౌన్సిలర్‌లు మయూరి రాజుగౌడ్, రాంసింగ్, మాజీ ఉప సర్పంచ్‌లు కృష్ణ, పర్వా శ్యాంరావు, బీఎస్పీ అసెంబ్లీ సెగ్మెంట్ అధ్యక్షుడు శ్రీశైలం పాల్గొన్నారు.

యాసంగి ధాన్యం రూ.300 కోట్లు!



ధాన్యాన్ని తూకం వేస్తున్న దృశ్యం

- చివరి దశకు ధాన్యం కొనుగోళ్లు
- రూ.1.46 మెట్రిక్ టన్నులు సేకరణ
- మరో ఐదారు వేల మెట్రిక్ టన్నులు వచ్చే అవకాశం

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: జిల్లాలో ధాన్యం సేకరణ చివరి దశకు చేరకుంది. ఇప్పటి వరకు 29,965 మంది రైతుల వద్ద 1.45 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. ఈ ధాన్యం విలువ రూ.300.74 కోట్లు. మరో ఐదారు వేల మెట్రిక్ టన్నులకు మించి కేంద్రాలకు వచ్చే అవకాశం లేదని అధికారులు అంచనా వేస్తున్నారు. మొత్తం మీద సీజను ముగిసే నాటికి సుమారు 1.50 లక్షల మెట్రిక్ టన్నుల కొనుగోళ్లు జరుగుతాయని భావిస్తున్నారు. ఇప్పటికే కొనుగోలు చేసిన ధాన్యం 4,319 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద ఉంది. ఈ ధాన్యాన్ని మిల్లులకు తరలించాల్సి ఉంది. మరో పక్షం రోజుల్లో ఈ యాసంగి సేకరణ ప్రక్రియ పూర్తవుతుందని అధికార యంత్రాంగం భావిస్తోంది.

అందని ధాన్యం డబ్బులు..

- ధాన్యం సేకరణ చివరి దశకు చేరుకున్నప్పటికీ విక్రయించిన రైతులకు డబ్బులు అందడంలో జాప్యం జరుగుతోంది. పక్షం రోజుల క్రితం విక్రయించిన రైతులకు కూడా కొందరు రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయలేదు.
- ఇప్పటి వరకు 11,762 మంది రైతులకు రూ.118.55 కోట్లను ఆయా రైతుల ఖాతాల్లో జమ చేశారు. ఇంకా 18,203 మంది రైతులకు రూ.182.19 కోట్లు రావాల్సి ఉంది.
- కాంటా వేసిన 48 గంటల్లో డబ్బులు రైతుల ఖాతాల్లో జమ కావాల్సి ఉండగా, వారాల తరబడి జమ కాకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు.
- కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు కొన్న ధాన్యానికి సంబంధించిన ప్రత్యేక వెబ్‌సైట్‌లో వివరాలను నమోదు చేయాల్సి ఉంటుంది.
- ఇంకా 11,091 మెట్రిక్ టన్నుల ధాన్యానికి సంబందించిన రైతుల వివరాలు ఎంట్రీ చేయాల్సి ఉంది. ఈ ఎంట్రీ పూర్తయితేనే రైతుల ఖాతాల్లో ధాన్యం డబ్బులు జమ అవుతాయి.

వాస్తవాలకు దూరంగా అంచనాలు..

- ఈ యాసంగి సీజనులో వ్యవసాయశాఖ ఇచ్చిన అంచనాలు వాస్తవ పరిస్థితులకు భారీగా తేడా ఉంది. ఈసారి సుమారు 2.30 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడులు వస్తాయని ఆశాఖ అంచనా వేసింది.
- ఇందులో రైతుల సొంత అవసరాలకు పోగా మిగిలిన సుమారు 2.07 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు కేంద్రాలకు వచ్చే అవకాశాలున్నట్లు ఆశాఖ నివేదిక ఇచ్చింది.
- కానీ ఇందులో కేవలం 75 శాతం మాత్రమే ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చింది. అంచనా కంటే సుమారు 50 వేల మెట్రిక్ టన్నులు తక్కువ వచ్చేనట్లు తేలింది.

177 కొనుగోలు కేంద్రాలు మూసివేత

- ఈ యాసంగి సీజనులో జిల్లా వ్యాప్తంగా 211 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు అన్ని చోట్ల ఈ కేంద్రాలను ప్రారంభించారు.
- అయితే ధాన్యం రాక నిలిచిపోవడంతో ఇందులో 177 కొనుగోలు కేంద్రాలను ఇప్పటికే మూసివేశారు. ప్రస్తుతం 34 కేంద్రాల్లో మాత్రమే సేకరణ కొనసాగుతోంది.
- జిల్లాలో ఐకేపీ, సహకార సంఘాలు, డీసీఎంఎస్‌ల ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను నిర్వహించారు.

మహిళా శిశు సంక్షేమానికి విప్లవాత్మక పథకాలు



చెక్కు అందజేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ మంజు శ్రీ, చింతా ప్రభాకర్

జెడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీ జైపాల్ రెడ్డి

సంగారెడ్డి మున్సిపాలిటీ: మహిళా సంక్షేమానికి ముఖ్యమంత్రి కేసీఆర్ పాటుపడుతున్నారని జెడ్పీ చైర్‌పర్సన్ మంజు శ్రీ జైపాల్ రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం సంగారెడ్డిలో మహిళ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ మహిళా సంక్షేమ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా సంక్షేమం కోసం నిర్వహిస్తున్న కార్యక్రమాలు, మహిళా, శిశు సంక్షేమ శాఖ ప్రగతి నివేదికను సీడీపీఓ రేణుక వివరించారు. మహిళా సాధికారితపై రూపొందించిన సీడీని ప్రదర్శించారు. అనంతరం జెడ్పీ చైర్ పర్సన్ మాట్లాడుతూ మహిళల సంక్షేమం కోసం, పుట్టబోయే బిడ్డల గురించి ఆలోచించే ముఖ్యమంత్రి ఉండటం మన అదృష్టమన్నారు. తెలంగాణ ప్రభుత్వం మహిళా శిశు సంక్షేమానికి విప్లవాత్మక పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. రాష్ట్ర చేనేత అభివృద్ధి సంస్థ చైర్మన్ చింతా ప్రభాకర్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం మహిళలకు సముచితస్థానం కల్పించిందన్నారు. డీఆర్‌ఓ నగేష్ మాట్లాడుతూ మహిళలకు ప్రభుత్వం అండగా ఉందన్నారు. ఆర్డీఓ రవీందర్ రెడ్డి మాట్లాడుతూ దశాబ్ది ఉత్సవాలను 21 రోజులు పండగ వాతావరణంలో జరుపు కుంటున్నామన్నారు. అనంతరం అంగన్ వాడీ టీచర్లు, వర్కర్లను, మెడికల్ ఆఫీసర్లు, ఏఎన్‌ఎంలను సన్మానించారు. ఐకేపీ మహిళా సంఘాలకు బ్యాంకు లింకేజీ రుణ చెక్కును అందజేశారు. కార్యక్రమంలో సీడీపీ ఓ రేణుక, మున్సిపల్ చైర్ పర్సన్ విజయలక్ష్మి, వైస్ చైర్ పర్సన్ లతా, డీసీసీబీ వైస్ చైర్మన్ మాణిక్యం, సీడీసీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అంగన్ వాడీ టీచర్లు, వర్కర్లు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, మెడికల్ ఆఫీసర్లు, తహసీల్దార్లు ఎంపీడీఓలు, ఐకేపీ సంఘాల మహిళలు, మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ సిబ్బందిని పర్మనెంట్ చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు, కార్మికులు

కొండాపూర్(సంగారెడ్డి): గ్రామ పంచాయతీ సిబ్బందిని పర్మనెంట్ చేయడంతో పాటు జీఓ నెంబర్ 60 ప్రకారం వేతనాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు డిమాండ్ చేశారు. మంగళవారం సంగారెడ్డిలోని సుందరయ్య భవన్‌లో గ్రామ పంచాయతీ యూనియన్ జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాటాడారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 9 సంవత్సరాలు పూర్తయినా పంచాయతీ సిబ్బంది, కార్మికుల సమస్యలు పరిష్కారం కాలేదని వాపోయారు. రూ.8500 వేతనం పూర్తిస్థాయిలో అమలు కావడం లేదన్నారు. ఇటీవల సీఎం ప్రకటించిన రూ.వెయ్యి కూడా అందించడం లేదని, పెరిగిన వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం డీపీఓ సూపరింటెండెంట్‌కు వినతిపత్రం ఇచ్చారు.

25లోపు టీచర్ల పదోన్నతుల షెడ్యూల్

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి



జోగిపేట(అందోల్): ఉపాధ్యాయుల పదోన్నతుల షెడ్యూలు ఈనెల 25లోపు ప్రభుత్వం విడుదలయ్యే అవకాశం ఉందని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి ప్రకటించారు. ఎడ్యుకేట్ అండ్ ఎన్‌రిక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర పీఆర్టీయూ అసోసియేట్ అధ్యక్షుడు ఏ.మాణయ్య అధ్యక్షత ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు బ్యాగుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బదిలీలకు సంబంధించి కోర్టులో మంగళవారం రోజు తీర్పు వెలువడే అవకాశం ఉందని, ఒకవేళ కోర్టు స్టే ఇవ్వకపోతే వారంలో బదిలీల షెడ్యూలు విడుదలవుతుందని, స్టే ఇస్తే పదోన్నతుల షెడ్యూలు మాత్రం విడుదలవుతుందన్నారు. ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించే సంఘం రాష్ట్రంలో ఏదైనా ఉన్నదంటే అది టీపీఆర్టీయూనని అన్నారు. ఉపాధ్యాయుల సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా టీపీఆర్టీయూ అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మణ్, మదన్‌మోహన్, గౌరవ అధ్యక్షుడు ప్రభు, కోఆర్డినేటర్ మధుసూదన్, ఎడ్యుకేట్ అండ్ ఎన్‌రిక్ ఫౌండేషన్‌కు చెందిన డాక్టర్ రమేష్, డాక్టర్ సువర్చల, డాక్టర్ ప్రతీక్, పీఆర్టీయూ మండల అధ్యక్ష, కార్యదర్శులు నరోత్తం, రాజమల్లు పాల్గొన్నారు.

కేతకి హుండీ ఆదాయం రూ.18.15 లక్షలు



కానుకలను లెక్కిస్తున్న భక్తులు

ఝరాసంగం(జహీరాబాద్): దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన శ్రీ కేతకి సంగమేశ్వర ఆలయంలో హుండీ లెక్కించారు. మంగళవారం ముందుగా పార్వతీ పరమేశ్వరులకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించారు. నగదు రూ.18,14,690 వచ్చినట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ రంగారావు, కేతకి ఆలయ పాలక మండలి చైర్మన్ నీల వేంకటేశం, ఈఓ శశిధర్, పాలకమండలి సభ్యులు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

మేయర్‌ను కలసిన కార్పొరేటర్‌లు



పుష్పగుచ్ఛం ఇస్తున్న కార్పొరేటర్లు

రామచంద్రాపురం (పటాన్‌చెరు): తెలంగాణ రాష్ట్ర అవతరణ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మిని మంగళవారం కార్పొరేటర్‌లు పుష్పనగేష్, సింధు ఆదర్శ్‌రెడ్డి కలసి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం రామచంద్రాపురం డివిజన్ కార్పొరేటర్ పుష్పనగేష్ స్థానిక సమస్యలను పరిష్కారించాలని కోరుతూ ఆమెకు వినతిపత్రం అందజేశారు.



ఖేడ్ మున్సిపల్ చైర్‌పర్సన్ రుబీనా నజీబ్‌ను సన్మానిస్తున్న కలెక్టర్ డాక్టర్ శరత్

జిల్లాలో ప్రగతి అమోఘం

కలెక్టర్ డాక్టర్ శరత్

నారాయణఖేడ్: మహిళా సాధికారితతో జిల్లా ప్రగతి అమోఘమని కలెక్టర్ డాక్టర్ శరత్ అన్నారు. నారాయణఖేడ్‌లో మంగళవారం తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన మహిళ సంక్షేమ దినోత్సవ వేడుకల్లో మాట్లాడారు. దశాబ్దం క్రితం మహిళలు కార్యాలయాలకు, బ్యాంకులకు వెళ్లడానికి ఇబ్బంది పడేవారన్నారు. ప్రస్తుతం వారు కార్యాలయాలతోపాటు బ్యాంకులకు ధైర్యంగా వెళ్లి పనులు చేసుకుంటున్నారన్నారు. ప్రభుత్వం మహిళా సంక్షేమానికి అధిక ప్రాధాన్యతను ఇస్తుందని తెలిపారు. మహిళలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికాభివృద్ధి సాధించడం ఆనందంగా ఉందన్నారు. ప్రస్తుతం జిల్లాలో బ్యాంకు లింకేజీ రుణాల వృద్ధిరేటు 120 శాతానికి చేరుకుందన్నారు. జిల్లాలో మాతా శిశు మరణాలు లేవన్నారు. గతంలో మహిళలకు ప్రసవ సెలవులు 90 రోజులు ఇస్తే ప్రస్తుతం 180 రోజులు ఇస్తున్నారన్నారు. ఈ సందర్భంగా నారాయణఖేడ్ డివిజన్ పరిధిలోని మహిళా సంఘాలకు జూన్ 23 వరకు బ్యాంకు లింకేజీల ద్వారా రూ.28.48కోట్ల చెక్కును కలెక్టర్ అందించారు. కార్యక్రమంలో ఖేడ్ మున్సిపల్ చైర్‌పర్సన్ రుబీనా నజీబ్, ఎంపీపీ చాందీబాయి చౌహాన్, సిర్గాపూర్ ఎంపీడీవో సుజాత, పంచాయతీ కార్యదర్శి సుధా కులకర్ణి, ఐకేపీ సీసీలు నవరాణి, రేణుకలను కలెక్టర్ సన్మానించారు. జిల్లా స్త్రీ శిశుసంక్షేమాధికారిణి పద్మావతి, జిల్లా పంచాయతీ అధికారి సురేశ్ మోహన్, జిల్లా అటవీ అధికారి శ్రీధర్‌రావు, ఆర్డీఓ అంబదాస్ రాజేశ్వర్, ఐకేపీ డీపీఎం కొమురయ్య, సీడీపీవో సుజాత, ఎంపీపీలు చాందీబాయి చౌహాన్, జయశ్రీరెడ్డి, మోతీబాయి, జెడ్పీటీసీలు లక్ష్మీబాయి రవీందర్‌నాయక్, రాజురాథోడ్, ఎంపీడీఓ వెంకటేశం, ఏపీఎం టిక్యానాయక్, వంశీకృష్ణ, చంద్రశేఖర్, ధన్‌రాజ్‌గిరి పాల్గొన్నారు.

విద్యార్థుల అభివృద్ధికి కృషి చేయాలి

డీఈఓ వేంకటేశ్వర్లు



మాట్లాడుతున్న డీఈఓ వేంకటేశ్వర్లు

కొండాపూర్(సంగారెడ్డి): డిజిటల్ రూమ్ శిక్షణను ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకొని విద్యార్థుల అభివృద్ధికి కృషి చేయాలని డీఈఓ వేంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలోని పోతిరెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు ఇంటరాక్టివ్ ఫ్లాట్ ఫ్యానల్ డిజిటల్ తరగతి గది శిక్షణ కార్యాక్రమాన్ని నిర్వహించారు. శిక్షణ కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా 45 పాఠశాలల నుంచి 90 మంది ఉపాధ్యాయులు హాజరయ్యారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ శిక్షణ అంశాలను తమ పాఠశాలలోని తోటి ఉపాధ్యాయులకు తెలియజేయాలన్నారు. అలాగే విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి డిజిటల్ విద్యా విధానం ఏ విధంగా ఉపయోగపడుతుందో వివరించారు. సెక్టోరియల్ అధికారి వేంకటేశం మాట్లాడుతూ రోజువారి విద్యా బోధన అభ్యసన ప్రక్రియలో ఈ నూతన టెక్నాలజీని నిత్యం ఉపయోగించాలన్నారు. కార్యక్రమంలో కోర్స్ కోఆర్డినేటర్, ప్రధానోపాధ్యాయుడు జాకీర్ హుస్సేన్, స్టేట్ రిసోర్స్ పర్సన్‌లు గోర్ల ప్రీత్, టెక్నికల్ టీం సభ్యుడు లక్ష్మీనారాయణ, సీఆర్పీ శేఖర్ పాల్గొన్నారు.

భూమికి బదులు భూమి ఇవ్వాలి

టీపీసీసీ ఉపాధ్యక్షుడు డాక్టర్ సంజీవరెడ్డి



మాట్లాడుతున్న డాక్టర్ సంజీవరెడ్డి

నారాయణఖేడ్: చెరువు నిర్మాణంతో భూములు కోల్పోతున్న పేద గిరిజన రైతులకు 2013 భూసేకరణ ప్రకారం పరిహారం లేదా, భూమికి బదులు భూమి, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని టీపీసీసీ ఉపాధ్యక్షుడు డాక్టర్ సంజీవరెడ్డి డిమాండ్ చేశారు. మనూరు మండలంలోని ఎనక్‌పల్లి- ఇరక్‌పల్లిల మధ్య చెరువు నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులతో కలిసి మంగళవారం నారాయణఖేడ్ ఆర్డీఓ అంబదాస్ రాజేశ్వర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చెరువు నిర్మాణం కారణంగా ఎనక్‌పల్లి రత్నానాయక్ తండా, ఇరక్‌పల్లి శామానాయక్ తండాల పరిధిలోని 40 మందికి నోటీలు జారీ చేశారన్నారు. ఈ భూములపై ఆధారపడి జీవిస్తున్న రైతులు చెరువు నిర్మాణంలో భూములు కోల్పోతున్నారని తెలిపారు. చెరువు నిర్మాణానికి రైతులు అడ్డంకి కాదని, కోల్పోయిన భూములకు బదులు భూమిని ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేదా 2013 భూ సేకరణ చట్టం ప్రకారం పరిహారం ఇస్తూ కుటుంబంలో ఒకరికి ప్రభుత్వం ఉద్యోగం ఇచ్చి ఆదుకోవాలన్నారు. సమావేశంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు భోజిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

విదేశాల్లో ఉద్యోగ అవకాశాలు

సంగారెడ్డి అర్బన్: విదేశాల్లో ఉద్యోగాలు చేయాలనుకునే అభ్యర్థులకు కన్స్యూసో టామ్ కామ్ (తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ) సంస్థ విదేశాల్లో నర్సులు, ఆరోగ్య సంరక్షణ కార్మికుల ఖాళీల కోసం అభ్యర్థులను ఎంపిక చేస్తున్నామని ఉపాధి కల్పనాధికారి వందన మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అమెరికా, కెనడా, జపాన్, ఆస్ట్రేలియా, యూకే, జర్మనీ ఇతర యూరోపియన్ అనేక అభివృద్ధి చెందిన దేశాల్లో అర్హత కలిగి నర్సులు, ఇతర ఆరోగ్య సంరక్షణ కార్మికులకు పెద్ద డిమాండ్ ఉందన్నారు. అభ్యర్థులు రెజ్యూమ్, సంబంధిత పత్రాలను వెబ్ సైట్ www.tomcomteanfana.gov.in పొందుపర్చాలి లేదా 6302292450 7893566493 సంప్రదించాలన్నారు.

వారం క్రితం ఇంటి నుంచి వెళ్లి..

- బాసర ట్రిపుల్ ఐటీలో విద్యార్థిని ఆత్మహత్య
- గౌౖరెకల్‌లో విషాదఛాయలు
- మృతి సమాచారమివ్వని వర్సిటీ



దీపిక (ఫైల్)

వట్‌పల్లి(అందోల్): వారం క్రితం చదువుకునేందుకు యూనివర్సిటీకి వెళ్లిన విద్యార్థిని శవమై కనిపించింది. అనూహ్యంగా జరిగిన ఈ సంఘటనతో బాసర ట్రిపుల్ ఐటీలో కలకలం రేపింది. బాసర ట్రిపుల్ ఐటీలో పీయూసీ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థిని దీపిక(17) మంగళవారం ఆత్మహత్య చేసుకొని మృతిచెందడంపై విద్యార్థిని స్వగ్రామం సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి మండలం గౌౖరెకల్ లో విషాదఛాయలు అలుముకున్నాయి. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఈనెల 5వ తేదీన తండ్రి వడ్ల వీరన్న తన కూతురు దీపికను యూనివర్సిటీలో వదిలి వచ్చాడు. అంతలోనే కూతురు మృతిచెందిన వార్త తల్లిండ్రులను శోకసంద్రంలో ముంచెత్తింది. యూనివర్సిటీలో వదిలినప్పుడు తన కూతురు నవ్వుకుంటూ బైబై చెబుతూ తనను ఇంటికి పంపించిందని తండ్రి బోరున విలపించాడు. దీపిక పదో తరగతి వరకు దేవ నూర్ ఉన్నత పాఠశాలలో చదువుకుంది. చదువులో చురుకుగా ఉండేదని పది వార్షిక పరీక్షల్లో 9.8 జీపీఏ రావడంతో ట్రిపుల్‌ఐటీలో గతేడాది సీటువచ్చిందని దేవనూర్ పాఠశాల ఉపాధ్యాయులు చెబుతున్నారు.

సమాచారం ఇవ్వని వర్సిటీ అధికారులు

బాతురూంలో కొన ఊపిరితో ఉన్న దీపికను నిర్మల్ ఆస్పత్రికి తరలించినా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించడంతో సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి మండలం గౌౖరెకల్ గ్రామానికి చెందిన విద్యార్థిని దీపిక మృతిచెందినట్లు టీవీలలో వార్త ప్రసారం అవుతోంది. అయినప్పటికీ యూనివర్సిటీ అధికారులు విద్యార్థిని తల్లిదండ్రులకు ఆమె మృతిపై ఎటువంటి సమాచారం ఇవ్వలేదు. టీవీ ప్రసారాలను చూసిన వారు దీపిక తండ్రి వీరన్నకు తెలియజేశారు. తనతో ఇప్పుడే నేను సీఐని మాట్లాడుతున్నాను అంటూ ఓ వ్యక్తి ఫోన్ చేశాడని, మీ కూతురుకు ఫిట్స్ వంటి ఏమైనా ఆరోగ్య సమస్యలు ఉన్నాయా? మీపాప పడిపోయిందని, చికిత్స కోసం ఆస్పత్రికి తరలించామని చెప్పాడు కానీ మరణించిందని చెప్పలేదని వాపోయాడు. యూనివర్సిటీ అధికారులు తన కూతురు విషయమై ఇప్పటివరకు ఎటువంటి సమాచారం ఇవ్వలేదంటూ తండ్రి విలపించడం అక్కడున్నవారిని కంటతడి పెట్టించింది.

విషాదఛాయలు

దీపిక మృతి చెందడం పట్ల గౌౖరెకల్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి. దీపిక మరణవార్త తెలిసినవారు వెంటనే వారి తండ్రి దగ్గరికి చేరుకొని ఎలా జరిగిందని వివరాలు తెలుసుకునే ప్రయత్నం చేశారు. అందరితో కలుపుగోలుగా ఉంటూ చిరునవ్వుతో ఆప్యాయంగా పలుకరించేదంటూ కంటతడిపెట్టారు.

క్లుప్తంగా

అక్రమ మట్టిరవాణాను అడ్డుకున్న గ్రామస్థులు

మనోహరాబాద్(తూప్రాన్): అక్రమంగా మట్టి తరలిస్తున్నారని గ్రామస్థులు టిప్పర్లను అడ్డుకున్నారు. మనోహరాబాద్ మండలంలోని జీడిపల్లి గ్రామం మీదుగా అక్రమ మట్టి రవాణాను ఓ పరిశ్రమకు తరలిస్తున్నారనే విషయం తెలుసుకొని కొంత మంది గ్రామస్థులు అడ్డుకున్నారు. ఈ విషయంలో రెవెన్యూ అధికారులకు సమాచారం చేరవేశారు. దీంతో సంఘటన స్థలానికి వీఆర్ఏను పంపించారు. వారు వచ్చి అక్రమ మట్టి రవాణాను అడ్డుకోవడంతో వీఆర్ఏకు మట్టిని తరలిస్తున్న బీఆర్ఎస్ నాయకులకు గొడవ జరిగింది. ఈ ఘటనలో టెంట్‌హౌస్ శ్రీనివాస్, హరీష్‌గౌడ్‌లు కోనాయపల్లి(పీటీ) వీఆర్ఏ నరేష్‌ను దుర్భాషలాడి అతని విధులకు ఆటంకం కలిగించారు. దీంతో వీఆర్ఏ నరేష్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని టిప్పర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పోగొట్టుకున్న ఫోన్ అందజేత



బాధితుడికి ఫోన్ అందజేస్తున్న ఎస్ఐ కాశీనాథ్

జహీరాబాద్ టౌన్: పోగొట్టుకున్న మొబైల్ ఫోన్‌ను గుర్తించి బాధితుడికి అప్పగించినట్లు చిరాగ్‌పల్లి ఎస్ఐ కాశీనాథ్ తెలిపారు. మొగుడంపల్లి మండలం మాడ్గి గ్రామానికి చెందిన సిరిగిరి జర్నప్ప బైక్‌పై వెళ్తున్న క్రమంలో ఫోన్ పోగొట్టుకున్నాడు. దీంతో అతను స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడన్నారు. సీఈఐ ఆర్‌తో మొబైల్ ఫోన్‌ను గుర్తించి బాధితుడికి అందజేశామని ఎస్ఐ పేర్కొన్నారు. మొబైల్ ఫోన్లు చోరీకి గురైన లేదా పోగొట్టుకున్న మీ సేవా లేదా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని ఎస్ఐ సూచించారు. ఈ కార్యక్రమంలో రైటర్ సికిందర్ తదితరులు పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం

రామాయంపేట(మెదక్): రామాయంపేట పట్టణానికి చెందిన దండు వంశీ (25) అదృశ్యమైనట్లు ఎస్ఐ రంజిత్ తెలిపారు. సోమవారం రాత్రి ఇంటి నుంచి బయటికి వెళ్లిన రంజిత్ తిరిగి రాలేదని అతని భార్య కవిత పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్ఐ కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

లోన్ పేరిట సైబర్ మోసం

వర్గల్(గజ్వేల్): లోన్ పేరిట ఓ వ్యక్తిని మోసం చేసిన సంఘటన వర్గల్ మండలం గౌరారంలో చోటుచేసుకుంది. ఎస్ఐ సంపత్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం..గౌరారం గ్రామానికి చెందిన సిరిపురం వెంకటేష్ ఫోన్‌పేకు రూ.5లక్షల లోన్ వచ్చిందని ఈ నెల 8న సైబర్ నేరగాళ్లు ఒక లింకు పంపించాడు. దాన్ని నమ్మిన వెంకటేష్ ఆ లింకును ఓపెన్ చేసి అందులో తన వ్యక్తిగత వివరాలు నమోదుచేశాడు. ఈ క్రమంలోనే గుర్తు తెలియని వ్యక్తి బాధితుడికి ఫోన్ చేసి రూ.5 లక్షల లోన్ మంజూరైందని చెప్పాడు. అందుకు సంబంధించి రూ.9,000 ఇన్సూరెన్స్, ఈఎంఐ పేమెంట్ కలిపి మొత్తం రూ.25,000 పంపించాలని సూచించాడు. లోన్ వస్తుందన్న ఆశతో ఆ మొత్తం పంపించాడు. మళ్లీ టీడీఎస్ కోసం రూ.25,000 పంపించాలని కోరడంతో వెంటనే వెంకటేష్ అనుమానపడ్డాడు. దీంతో తను మోసపోయినట్టుగా గుర్తించి వెంటనే సైబర్ పోర్టల్‌లో ఫిర్యాదు చేశాడు.

బెజ్జంకి ఎస్ఐపై సీపీకి ఫిర్యాదు

బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకి ఎస్ఐ దురుసుగా ప్రవర్తిస్తున్నాడని ఆరోపిస్తూ సిద్దిపేట సీపీకి తోటపల్లి సర్పంచ్ బోయినిపెల్లి నర్సింగరావు మంగళవారం ఫిర్యాదు చేశారు. దశాబ్ది వేడుకల్లో భాగంగా ఇటీవల నిర్వహించిన బతుకమ్మ ఉత్సవాలను ముగించాలని ఆదేశించడంతో సర్పంచ్‌తో వివాదం జరిగినట్లు పేర్కొన్నారు. ఈ విషయంలో మహిళలపై దురుసుగా ప్రవర్తించగా వాగ్వివాదం జరిగినట్లు చెప్పారు. మంత్రి స్వగ్రామం కావడంతో తెలంగాణ వేడుకల్లో వివాదం జరిగినట్లు అపవాదు వస్తుందనే కారణంతో తాను సముదాయించిట్లు సర్పంచ్ చెప్పారు. ఈ విషయంలో ఎస్ఐపై విచారణ చేపట్టాలని సీపీకి ఫిర్యాదు చేవారు. ఇటీవల కూడా మరో రెండు సంఘటనల్లో ఫిర్యాదుదారులనే ఎస్ఐ వేధించాడని ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు ఈ విషయంపై చర్యలు తీసుకోవాలని పలువురు బాధితులు కోరారు.

మైనర్ తప్పు.. మేజర్ ముప్పు

- పిల్లలకు వాహనాలు ఇస్తున్న తల్లిదండ్రులు
- ప్రమాదాల్లో ఒకటి మైనర్ డ్రైవింగ్ కేసు
- సైకిల్ నడపాల్సిన వయస్సులో బైక్‌పై స్వారీ
- కఠిన చర్యలు తీసుకుంటామన్న అధికారులు



ఇస్నాపూర్ చౌరస్తా వద్ద మైనర్లను తనిఖీలో పట్టుకున్న ట్రాఫిక్ పోలీసులు

పటాన్‌చెరు టౌన్: తల్లిదండ్రులకు పిల్లలే సర్వస్వం. వారిపై అతి ప్రేమతో బైక్‌లు, కార్ల ఇస్తున్నారు. వాటిని నడుపుతుంటూ అది చూసి సంబరపడుతున్నారు. అయితే కంటికి రెప్పలా పిల్లలను కాపాడుకోవాల్సిన తల్లిదండ్రులే వాహనాలు ఇచ్చి వారిని ప్రమాదాలల్లోకి నెడుతున్నారు. పట్టణ, మండల ప్రాంతాల్లో 4, 5 ప్రమాదాల్లో ఒకటి మైనర్ల డ్రైవింగ్ వల్లే ప్రమాదాలు జరుగుతున్నట్లు సమాచారం.

- ప్రస్తుతం పిల్లలు వాహనాలు నడిపేందుకు ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు. తల్లిదండ్రులు వద్దని చెప్తున్న వారి మాట వినకుండా ద్విచక్ర వాహనాలను తీసుకొని రహదారుల పైకి వస్తున్నారు.
- మరికొందరు స్వయంగా తమ పిల్లలకు డ్రైవింగ్ నేర్పిస్తున్నారు. సంగారెడ్డి జిల్లాలోని సంగారెడ్డి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ తో పోల్చుకుంటే, పటాన్ చెరు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో మైనర్ డ్రైవింగ్ కేసులను ఎక్కువగా నమోదయ్యాయి.
- సైకిల్ నడపాల్సిన వయస్సులో పిల్లలు ద్విచక్ర వాహనాలపై స్కూళ్లకు, కళాశాలలకు వెళ్తున్న విద్యార్థులు చాలామంది ఉన్నారు. పిల్లలకు వాహనాలు ఇచ్చి దుకాణాల్లో సరుకులు తేవాలని పంపుతున్నారు. మరికొందరి తమ పిల్లలు వాహనం నడుపుతున్నారని గర్వంగా చెప్పుకుంటున్నారు. ఇలా ఇవ్వడం తప్పని తెలిసే తప్పు చేస్తున్నారు.

జిల్లాలో మైనర్ డ్రైవింగ్ వివరాలు...

- జిల్లాలోని సంగారెడ్డి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు 12 మైనర్ డ్రైవింగ్ కేసులు నమోదయ్యాయి. ఆ కేసుల్లో రూ.6 వేలు జరిమానా విధించారు.
- పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ఏడాది 313 మైనర్ డ్రైవింగ్ కేసులకు రూ.1,56,500 జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరి



వాహనాలు నడపాలంటే 18 సంవత్సరాల పైబడి ఉండి డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా కలిగి ఉండాలి. గంటకు 25 కిలోమీటర్ కంటే వేగంగా వెళ్లలేని వాహనాలకు మాత్రమే డ్రైవింగ్ లైసెన్స్, రిజిస్ట్రేషన్ అవసరం లేదు. 26 కిలో మీటర్ల కంటే ఒక్క కిలోమీటర్ వేగంగా వెళ్లినా ఎలక్ట్రిక్ వాహనాలైనా రిజిస్ట్రేషన్ డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలి.
– రాజా మహమ్మద్, ఎంవీఐ



సంగారెడ్డి టౌన్‌లో బైక్‌పై వెళ్తున్న మైనర్లు

తల్లిదండ్రులే బాధ్యత వహించాలి



మైనర్లు వాహనాలు నడపరాదు. మొదటిసారి తనిఖీల్లో పట్టుబడితే వారికి జరిమానా విధించడంతో పాటు అవగాహన కల్పిస్తున్నాం. పిల్లల తల్లిదండ్రులను పిలిపించి వారికి కూడా కౌన్సిలింగ్ ఇస్తున్నాం. తల్లిదండ్రులు పిల్లలకు వాహనాలు ఇచ్చే వారు ప్రమాదంబారినపడే విధంగా ప్రోత్సహించడం సరికాదు. వాహనం ఇచ్చే ముందు ఒకసారి ఆలోచించాలి.
– ప్రవీణ్ రెడ్డి, ట్రాఫిక్ సీఐ

ఫర్టిలైజర్ షాపుల్లో తనిఖీలు



కోహీర్‌లో ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న టాస్క్‌ఫోర్స్ అధికారులు

కోహీర్(జహీరాబాద్): కోహీర్ మండలంలో విత్తనాలు, ఎరువుల దుకాణాలపై జిల్లా టాస్క్‌ఫోర్స్, వ్యవసాయాధికారులు మంగళవారం సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించారు. సోయాబీన్, మొక్కజొన్న, పత్తి, విత్తన నిల్వలను తనిఖీ చేశారు. విత్తనాలు, ఎరువుల స్టాక్ రిజిస్టర్లను సక్రమంగా నిర్వహించాలని డీలర్లను ఆదేశించారు. నాణ్యమైన విత్తనాలను మాత్రమే రైతులకు సరఫరా చేయాలని రైతులకు సూచించారు. విత్తనాలు, ఎరువుల కొనుగోలుకు సంబంధించి రైతులకు తప్పకుండా రశీదులు ఇవ్వాలన్నారు. విత్తనాలు, ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకొంటామని వారు హెచ్చరించారు. జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారి జేడీఏ పుష్పరాణి, ఏడీఏ భిక్షపతి, వ్యవసాయాధికారి నవీన్‌కుమార్, ఎస్ఐ అంబాజి, ఏఈఓలు పాల్గొన్నారు.

గడ్డివాములు దగ్ధం

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లి మండలం బొబ్బాయిపల్లి గ్రామంలోని హనుమాన్ దేవాలయం వద్ద విద్యుదాఘాతంతో గడ్డివాములు దగ్ధమయ్యాయి. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని హనుమాన్ దేవాలయం వద్ద విద్యుత్ వైర్ల నుంచి చిన్న పాటి గాలికి మంటలు వస్తుంటాయి. ఈ విషయాన్ని పలుమార్లు విద్యుత్ అధికారులకు చెప్పినా పట్టించుకోలేదు. ఈ క్రమంలోనే మంగళవారం మధ్యాహ్నం విద్యుత్ స్తంభంనుంచి నిప్పురవ్వలు వెలువడి ప్రక్కనే ఉన్న గడ్డివాములపై పడ్డాయి. దీంతో గడ్డివాములకు మంటలు అంటుకున్నాయి. అక్కడ మంటలు వ్యాపించే క్రమంలో అప్రమత్తమైన గ్రామస్తులు వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందజేశారు. సంఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. జేసీబీ సహాయంతో గడ్డి కుప్పలను వేరు చేసి మంటలను పూర్తిగా అదుపు చేశారు.

గోవా మద్యం పట్టివేత

సిద్దిపేటకమాన్: సిద్దిపేట పట్టణంలో గోవా మద్యాన్ని పట్టుకున్నారు. ఆబ్కారీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..ఘట్కేసర్ పరిధిలో మద్యం కేసు విచారణ చేస్తున్న ఆబ్కారీ పోలీసులు సిద్దిపేట పట్టణంలోని శ్రీనగర్ కాలనీకి చెందిన హరికృష్ణ గౌడ్ ఇంట్లో సోదాలు నిర్వహించారు. ఈ క్రమంలో అతని వాహనంలో 300 గోవా మద్యం సీసాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గోవా టూరిస్ట్ గైడ్‌గా పనిచేసున్న హరికృష్ణ హైదరాబాద్ ఇతర ప్రాంతాల్లో గోవా మద్యం సీసాలను విక్రయానికి పాల్పడుతుండేవాడని పోలీసుల విచారణలో నిందితుడు ఒప్పుకున్నట్టు తెలిపారు.

బాయిలర్ వద్ద కార్మికుడికి గాయాలు

జిన్నారం(పటాన్‌చెరు): బాయిలర్ వద్ద విధులు నిర్వహిస్తున్న సమయంలో ఒక్కసారిగా మంటలు వెలువడడంతో ఓ కార్మికుడికి తీవ్ర గాయాలైన ఘటన గడ్డపోతారం పారిశ్రామిక వాడలో మంగళవారం తెల్లవారు జామున జరిగింది. సీఐ సురేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..ఉత్తరప్రదేశ్ బాందా జిల్లా అర్మార్ గ్రామానికి చెందిన సన్నిదేవ్ బాయిలర్‌వద్ద విధులు నిర్వహిస్తున్నాడు. బాయిలర్‌ను కడిగి రసాయ నీళ్లను కొందరు పోయడంతో ఒక్కసారిగా మంటలు వెలువడ్డాయి. ఈ ఘటనలో సన్నీదేవ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. 30శాతం గాయాలు అయినట్లు వైద్యులు చెప్పారు. బాయిలర్ ఆపరేటర్ వీరరాజు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తునట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి



ముష్ణం అశోక్‌గౌడ్ (ఫైల్)

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లి మండలంలోని మంగోల్ గ్రామానికి చెందిన ముష్ణం అశోక్‌గౌడ్ (30) గద్వాల్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో సోమవారం రాత్రి మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి..ఫ్లెక్సీలు కట్టే ఆర్డర్ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఈ క్రమంలో విజయవాడలో జరిగే ఓ సమావేశానికి ఫ్లెక్సీ కట్టేందుకు హైదరాబాద్‌కు చెందిన మరి కొందరు కూలీలతో కలిసి డీసీఎంలో వెళ్తున్నాడు. ఈ నేపథ్యంలో గద్వాల చేరుకోగానే అక్కడ జరిగిన రోడ్డు ప్రమాదంలో అశోక్‌గౌడ్ మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కుటుంబీకులు, సర్పంచ్ పుల్లోజు కిరణ్ కుమార్‌చారి మంగళవారం సంఘటనా స్థలానికి వెళ్లి పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని మంగోల్ గ్రామానికి తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి మృతుని కుటుంబాన్ని పరామర్శించి రూ. 10వేలు ఆర్థిక సాయం అందజేశారు. మృతుడికి భార్య, మూడేళ్ల కుమారుడు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

శివ్వంపేట(నర్సాపూర్): రెండు బైక్‌లు ఢీకొన్న సంఘటనలో ఒకరికి తీవ్ర గాయాలైన సంఘటన మంగళవారం రాత్రి నర్సాపూర్– వెల్దుర్తి, లింగోజిగూడ చౌరస్తా వద్ద చోటుచేసుకుంది. లింగోజిగూడ తండాకు చెందిన విఠల్ పొలం వద్దకు బైక్‌పై వెళ్లి తండాకు వస్తున్న క్రమంలో ఎదురుగా వచ్చిన మరో బైక్‌ను ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో విఠల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో కుటుంబ సభ్యులు నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

బైక్ అదుపు తప్పి..

జగదేవ్‌పూర్(గజ్వేల్): బైక్ అదుపు తప్పి యువకుడు మృతి చెందిన సంఘటన తిగుల్ గ్రామ శివారులో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. మిరుదొడ్డి మండలం రుద్రారం గ్రామానికి శ్రీరామ్ నాగరాజు(32) మంగళవారం రాత్రి బైక్‌పై జగదేవ్‌పూర్ మండలం తిగుల్ గ్రామానికి వస్తున్న క్రమంలో గ్రామ శివారులోకి రాగానే బైక్ అదుపు తప్పి విద్యుత్ స్తంభానికి ఢీకొని అక్కడికక్కడే మృతి చెందారు.

భూతగాదా కేసులో నిందితుడి అరెస్ట్



నిందితుణ్ని అదుపులోకి తీసుకున్న ఎస్ఐ

జహీరాబాద్: భూతగాదాలో జోక్యం చేసుకుని చంపేస్తానని బెదిరించినందుకు గాను నిందితుడిని మంగళవారం అరెస్టు చేసి కోర్టులో హాజరు పర్చినట్లు ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం..జహీరాబాద్ పట్టణంలోని బీదర్ వైపు వెళ్లే రోడ్డు పక్కన రైల్వే గేటు వద్ద గల సర్వే నెం.310/ఎ లో 25ఎకరాల భూమికి సంబంధించి యజమానులైన జైపాల్, అతని కుటుంబ సభ్యులు హైకోర్టులో కేసు వేయగా అది న్యాయస్థానంలో పెండింగ్‌లో ఉంది. 2022 జూన్ 25వ తేదీన జైపాల్ అతని అగ్రిమెంట్ హోల్డర్లు వాజీద్ హక్కాని, అతిక్ హక్కానీలు అట్టి భూమికి ఫెన్సింగ్ వేయుచుండగా జహీరాబాద్ పట్టణంలోని మోమిన్ మహెలాలకు చెందిన సయ్యద్ ఆబిద్ హుస్సేన్ తన సోదరులైన పప్పు, మంజూర్ హుసేన్, అతని అనుచరులైన మున్నాన్, మోసిన్‌లు కలిసి అట్టి భూమిలోకి అక్రమంగా ప్రవేశించారు. ఈ విషయంలో తమను రోడ్డుపైకి పిలిచి భూమి ఇవ్వక పోతే చంపేస్తామని జులూం చేసి బెదిరించారని జైపాల్ ఫిర్యాదు చేశాడు. ప్రధాన నిందితుడు సయ్యద్ ఆబెద్ హుస్సేన్ అలియాస్ అలీభాయ్‌ని అరెస్టు చేసి జ్యూడీషియల్ రిమాండ్‌కు తరలించారు.

అమ్మకానికి ఆడ శిశువు

- అడ్డుకున్న బాలల పరిరక్షణ అధికారులు
- చిల్డ్రన్ హోంకు తరలింపు



ఆడ శిశువును అమ్మకానికి పెట్టిన తల్లి



ఆడ శిశువును కొనుగోలు చేసిన దంపతులు

సిద్దిపేటఅర్బన్: పేగు బంధం తెంచుకొని పుట్టి రెండు రోజులు కాకముందే ఆడపిల్లను అమ్మకానికి పెట్టింది ఓ తల్లి. ఘటనకు సంబంధించి బాలల పరిరక్షణ విభాగం అధికారులు రాము, శిశుగృహ మేనేజర్ ఝాన్సీ, సామాజిక కార్యకర్త రాజారాం తెలిపిన వివరాల ప్రకారం..మిరుదొడ్డి మండలం మోతే గ్రామానికి చెందిన గొడుగు మంజులకు నాలుగో సంతానంగా సోమవారం సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రిలో ఆడ శిశువు జన్మించింది. మంజులకు గతంలో ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉండగా మరో ఇద్దరు పుట్టి చనిపోయారు. కాగా మంజుల భర్త సైతం ఆదివారం చనిపోగా అంత్యక్రి యలు పూర్తి చేసిన అనంతరం పురిటి నొప్పులు రావడంతో సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకొచ్చారు. అక్కడ ఆమె ఆడపిల్లకు జన్మనిచ్చింది. చేసేదేమి లేక తల్లి బూరుగుపల్లి శివారుకు చేరుకొని ముందుగా చేసుకున్న ఒప్పందం మేరకు గజ్వేల్‌కు చెందిన ఎండీ జామీన్, ముంతాజ్ దంపతులకు రూ. 20 వేలకు అమ్మేసింది. దీన్ని గమనించిన స్థానికులు 1098కు సమాచారం ఇవ్వడంతో బాలల పరిరక్షణ అధికారులు అక్కడికి చేరుకొని వివరాలు సేకరించి శిశువును స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వైద్య పరీక్షలు నిర్వహించి బాలసదనంకు తల్లిని, శిశువును తరలించారు. తన భర్త రెండు రోజుల క్రితం చనిపోవడంతో చేతిలో డబ్బులు లేకపోవడం, ఆడపిల్లను పోషించే పరిస్థితి లేక విక్రయించినట్టు తల్లి మంజుల తెలిపింది. బుధవారం శిశువును కొనుగోలు చేసిన వారిని, తల్లిని, శిశువును సీడబ్ల్యూసీ ముందు హాజరు పర్చనున్నట్టు బాలల పరిరక్షణ అధికారులు తెలిపారు.

మధ్యవర్తిగా వచ్చి బెదిరించడం వల్లే మక్సూద్ హత్య

- ముగ్గురు నిందితుల అరెస్టు
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ రఘు



హత్యకేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రఘు

జహీరాబాద్: బాకీ డబ్బుల విషయమై మధ్యవర్తిగా వచ్చి బెదిరించడం వల్లే మక్సూద్(35)ను ముగ్గురు యువకులు హత్యచేశారని డీఎస్పీ వి రఘు తెలిపారు. మక్సూద్ హత్య కేసులో మంగళవారం ముగ్గురు నిందితులను అరెస్టుచేసినట్లు పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి డీఎస్పీ వెల్లడించిన వివరాల ప్రకారం..జహీరాబాద్ పట్టణంలోని నాగుల కట్టవద్ద బంగారు, వెండి ఆభరణాల షాపు యజమాని ఎండి మక్సూద్ సోమవారం హత్యకు గురయ్యాడు. మక్సూద్ వద్ద పని చేస్తున్న అతిక్ రెండు సంవత్సరాల క్రితం జహీరాబాద్ పట్టణానికి చెందిన షౌకత్ వద్ద అప్పుగా డబ్బులు తీసుకున్నాడు. సరైన సమయంలో తిరిగి ఇవ్వక పోవడం వల్ల 4 నెలల క్రితం నవాజ్ మధ్యవర్తిగా వచ్చి డబ్బులు ఇప్పిస్తానని ఒప్పుకున్నాడు. గడువు ముగిసినా అతిక్ డబ్బులు ఇవ్వలేదు. సోమవారం ఉదయం నవాజ్, తాజొద్దీన్‌బాబా, ఫెరోజ్‌లు కలిసి హోతి(కె) గ్రామంలోని అతిక్ ఇంటికి వెళ్లారు. అతణ్ని బెదిరించి వచ్చారు. అతిక్ ఈ విషయాన్ని తన యజమాని మక్సూద్‌తో చెప్పాడు. సాయంత్రం 4గంటల సమయంలో మక్సూద్ నవాజ్‌కు ఫోన్‌చేసి మీరు అతిక్‌ను ఎందుకు బెదిరిస్తున్నారని ప్రశ్నించాడు. షౌకత్‌తో తాము మాట్లాడుకుంటామని, మీరు అనవసరంగా ఈ విషయంలో జోక్యం చేసుకోవద్దని హెచ్చరించాడు. ఈ విషయంలో కోపం తెచ్చుకున్న నిందితులు మక్సూద్ అనవసరంగా మా మధ్యలోకి వచ్చి మమ్ములనే బెదిరిస్తున్నాడని, అతడిని ఎలాగైన అంతమొందించాలని పథకం వేసుకున్నారు. పథకం ప్రకారం మక్సూద్‌ను ఈద్గా ముందు గల షకీల్ హోటల్ వద్దకు పిలిపించుకొని దాడి చేశారు. హత్య కేసులో నిందితులు జహీరాబాద్ పట్టణంలోని గడికి చెందిన షానవాజ్(23), ఫరీద్‌నగర్ కాలనీకి చెందిన ఎండి తాజొద్దీన్(22), గడికి చెందిన ఫెరోజ్ పాష(26)లను పట్టణ శివారులోని తవక్కల్ ఫంక్షన్ హాల్ వద్ద పట్టుకుని, వారి వద్ద నుంచి తల్వార్, కమ్మకత్తి, మోటారు సైకిల్‌ను స్వాధీనం చేసుకుని కోర్టులో హాజరు పర్చినట్లు డీఎస్పీ వివరించారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జి డీఎస్పీ వెంకటేష్, ఎస్ఐ శ్రీకాంత్ పాల్గొన్నారు.

జేసీబీ గుంతలో పడి విద్యార్థి..



గుగులోత్ ఈశ్వర్ (ఫైల్)

నిజాంపేట(మెదక్): జేసీబీ గుంతలో పడి విద్యార్థి మృతి చెందిన సంఘటన నిజాంపేట మండలంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం..నగరం గ్రామానికి చెందిన గుగ్‌లోత్ రాజు, నీలలకు ముగ్గురు కుమారులు. రెండో కుమారుడు గుగ్‌లోత్ ఈశ్వర్(16) పదోతరగతి పూర్తి చేసుకొని మంగళవారం ఓ రెసిడెన్షియల్ కళాశాలలో చేరడానికి వెళ్లేందుకు అన్ని సిద్ధం చేసుకున్నాడు. ఈ క్రమంలో తన పొలంలో ఉన్న జేసీబీ నీటిగుంతలో స్నానం చేయడానికి వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. దీంతో ఆందోళనకు గురైన కుటంబ సభ్యులు అక్కడ వెళ్లి చూడగా ప్రక్కనే బట్టలు విప్పి ఉండడంతో అందులో దిగి చూశారు. జేసీబీ గుంతలో అతను మృతి చెంది ఉన్నాడు. వెంటనే కుటుంబ సభ్యులు మృతదేహాన్ని బయటికి తీసి బోరున విలపించారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి



ప్రసాద్ (ఫైల్)

దుబ్బాక: రోడ్డు ప్రమాదానికి గురైన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..దుబ్బాక పట్టణానికి చెందిన ఆలేటి ప్రసాద్ (38) వంట పనిచేస్తూ భార్య స్వాతి, కొడుకు శ్రీకరణ్‌తో జీవనం సాగిస్తున్నాడు. పని మీద వెళ్తున్న అతను పెద్ద గుండవెళ్లి నుంచి దుంపలపల్లి చేరుకోగానే అక్కడ జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రసాద్ తలకు, కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో అతణ్ని కుటుంబ సభ్యులు సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సలహా మేరకు మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని యశోదకు అక్కడి నుంచి నిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు.

చేనేత వృత్తి లేక వంట పనిచేస్తూ..

మృతుడు చేనేత కుటుంబానికి చెందిన వాడు. వృత్తిలో ఉపాధిలేకపోవడంతో వంట పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలోనే రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందడం బాధాకరమని స్థానికులు వాపోయారు. మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వం, దాతలు ఆదుకోవాలని నీలకంఠ సంఘం అధ్యక్షుడు సత్యానందం, కార్యదర్శి అంబుదాస్, తదితరులు కోరారు.

గుండెపోటుతో వ్యక్తి..



మంక్యానాయక్ (ఫైల్)

మద్దూరు(హుస్నాబాద్): దూల్మిట్ట మండలంలోని కొండాపూర్ గ్రామంలో ఓ వ్యక్తి గుండెపోటుతో మృతి చెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం..హరితహారంలో పనిచేస్తున్న మంక్యానాయక్(45), రోజు మాదిరిగానే రోడ్లకు ఇరువైపుల హరితాహారం మొక్కలకు ట్యాంకర్ సహాయంతో నీళ్లు పోసేవాడు. ఈ క్రమంలో మంక్యానాయక్ మంగళవారం కూడా హరితహారం మొక్కలకు నీరు పెడు తుండగా ఒక్కసారిగా గుండెపోటు వచ్చి క్రింద పడ్డాడు. దీన్ని గమనిచిన స్థానికులు అతణ్ని రామవరంలోని ఓ ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతునికి భార్య, నలుగురు కుమారైలు ఉన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో నలుగురు మృతి

ఆర్థిక ఇబ్బందులు తాళలేక నలుగురు మృతి చెందారు.

మద్దూరు(హుస్నాబాద్): ఆర్థిక ఇబ్బందులు తాళలేక మనస్థాపం చెంది రైతు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మండల కేంద్రంలో మంగళవారం చోటు చేసుకుంది. గ్రామస్థులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..గ్రామానికి చెందిన ఇజ్జగిరి శేఖర్(33) తనకు ఉన్న 6ఎకారల భూమిలో వరిపొలం సాగు చేశాడు. ఇటీవల కురిసిన వడగండ్ల వర్షానికి పంటలు దెబ్బ తినడంతో మనస్థాపానికి గురయ్యాడు. దీంతో పాటు వ్యవసాయనికి, కుటుంబ పోషణకు చేసిన అప్పులు తీర్చేమార్గం లేకపోవడంతో మళ్లీ వ్యవసాయం చేసి అప్పులు తీర్చాలనుకున్నాడు. ఈ క్రమంలో పెట్టుబడికి ఎవరు కూడా అప్పు ఇవ్వకపోడంతో మనస్థాపానికి గురై తన వ్యవసాయ బావి వద్దకు వెళ్లి చెట్టుకు ఉరి వేసున్నాడు. మృతుని భార్య లావణ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ జగదీష్ తెలిపారు.

కొండపాకలో..

కొండపాక(గజ్వేల్): ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన కుకునూరుపల్లి మండల పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ పుష్పరాజ్ తెలిపిన వివరాల ప్రకారం.. మేదినిపూర్ గ్రామానికి చెందిన చక్రపాణి (60) ఈ నెల 12న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. గ్రామ శివారులోని అడవి దగ్గర చక్రపాణి చనిపోయినట్లు మంగళవారం కుటుంబ సభ్యులకు స్థానికులు సమాచారం చేరవేశారు. వెంటనే భార్య మల్లవ్వతో పాటు మరికొందరు వెళ్లి చూడగా చక్రపాణి మృతదేహంగా గుర్తించారు. కొన్ని నెలలుగా అతను ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతుండేవాడని కుటుంబ సభ్యులు పేర్కొన్నారు.

పటాన్‌చెరు టౌన్: అప్పుల బాధ తాళలేక ఓ వ్యక్తి బలవన్మరణానికి పాల్పడిన సంఘటన అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ సుభాష్ తెలిపిన వివరాల ప్రకారం..మోగుడంపల్లి మండలం, మన్నాపూర్ తొట్టి తండాకు చెందిన పరుశురాం (36) ఏడేళ్ల క్రితం అమీన్ పూర్ వలస వచ్చి కూలీ పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో మద్యానికి బానిసై అప్పులు చేశాడు. మంగళవారం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.

మద్యానికి బానిసై...

రామచంద్రాపురం(పటాన్‌చెరు): మద్యానికి బానిసై భవన నిర్మాణ కార్మికుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం ప్రకారం.. కర్ణాటక రాష్ట్రం గుల్బర్గా ప్రాంతానికి చెందిన హనుమంతప్ప (36) ఉపాధి నిమిత్తం తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధి కొల్లూరుకు వలస వచ్చాడు. ఇక్కడ భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో మద్యానికి బానిసై సోమవారం మద్యం తాగి ఉరివేసుకున్నాడు.